సాక్షి
కామారెడ్డి

మంగళవారం । 16 । జూలై । 2024



ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రజావాణికి వస్తున్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు.

- 8లో ▸



సమస్యలు పరిష్కరించాలని..

సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.8 /23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. జిల్లాలోని పలు ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

నేడు కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం సమావేశం

సాక్షి, కామారెడ్డి: రాష్ట్ర సచివాలయంలో మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించే సమావేశంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ సింధు శర్మ పాల్గొననున్నారు. ప్రజాపాలన, ధరణి, వానాకాలం పంటల సాగు, సీజనల్ వ్యాధులు, వన మహోత్సవం, మహిళా శక్తి, విద్య, శాంతి భద్రతలు, మాదక ద్రవ్యాల నియంత్రణ తదితర అంశాలపై సమీక్ష జరగనుంది. సమావేశంలో పాల్గొనడానికి కలెక్టర్, ఎస్పీ నివేదికలతో బయలుదేరి వెళ్లారు.

ఎల్లారెడ్డి ఆస్పత్రి పరిశీలన



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిని కాయకల్ప బృందం సభ్యులు సోమవారం పరిశీలించారు. బృందం సభ్యులు అమర్ సింగ్, శ్రీకాంత్‌రాజు ఆస్పత్రిలోని అన్ని వార్డులను తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్యం, వసతులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రవీంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారంతో మనస్థాపం చెంది దంపతుల ఆత్మహత్య

నవీపేట: తమపై తప్పుడు ప్రచారంతో మనస్థాపం చెందిన దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నవీపేట మండలంలో సోమవారం చోటుచేసుకుంది. నవీపేట ఎస్సై యాదగిరి గౌడ్, రైల్వే ఎస్సై సాయరెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. పోతంగల్ మండలంలోని హెగ్డోలి గ్రామానికి చెందిన భార్యభర్తలు అనిల్(28), శైలజా(24)కు ఏడాది క్రితం వివాహం జరిగింది. ఇటీవల ఓ ఘటనలో శైలజదే తప్పుగా ఆమె కుటుంబ సభ్యులు ప్రచారం చేశారు. తరచూ నిందిస్తుండటంతో మనస్థాపం చెందిన భార్యభర్తలు చనిపోవాలని నిశ్చయించుకున్నారు. ఈక్రమంలో సోమవారం ఉదయం ఓ సెల్ఫీ వీడియోలో 'బాసర గోదావరి నదిలో దూకి చనిపోతున్నామని' పేర్కొంటూ కొన్ని గ్రూప్‌లలో వైరల్ చేశారు. వెంటనే సన్నిహితులు కోటగిరి ఎస్సై సందీప్‌కు సమాచారమిచ్చారు. ఆయన వెంటనే గోదావరి నది సమీపంలోని నవీపేట, బాసర ఎస్సైలకు వీడియోను షేర్ చేశారు. దీంతో పోలీసులు సోమవారం రాత్రి రైలు పట్టాలపై గాలించగా నవీపేట మండలంలోని ఫకీరాబాద్–మిట్టాపూర్ రైల్వే ట్రాక్ పక్కన దంపతులు విగత జీవులుగా కనిపించారు. గుర్తు తెలియని రైలు కిందపడి మృతి చెందారని పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై సాయరెడ్డి పేర్కొన్నారు.

రుణమాఫీపై ముందడుగు!

- విధివిధానాలు ప్రకటించిన ప్రభుత్వం
- రేషన్‌కార్డు ప్రామాణికంగా అమలు
- జిల్లాలో లక్షమందికిపైగా ప్రయోజనం

ఎన్నికల హామీని నిలబెట్టుకునే దిశగా సర్కారు అడుగులు వేస్తోంది. రూ. 2 లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేసేందుకు సోమవారం విధివిధానాలను ప్రకటించింది. దీంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోంది.



సాక్షి, కామారెడ్డి: అధికారంలోకి వస్తే రూ. 2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఆ ఎన్నికలలో గెలిచి కాంగ్రెస్ గద్దెనెక్కడంతో తమ పంట రుణం మాఫీ అవుతుందని రైతులు ఆశించారు. కానీ ప్రక్రియ ప్రారంభంలో జాప్యం జరగడం, వానాకాలం పంట సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా నిధులు విడుదల చేయకపోవడంతో కొంత నిరాశ చెందారు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగస్టు 15 వరకు పంట రుణాలను మాఫీ చేస్తామని చెబుతూ వస్తున్నారు. దీనికి సంబంధించి సోమవారం ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. పంట రుణాల మాఫీపై మరో అడుగు ముందుకేసింది. రుణమాఫీకి సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేసింది. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9 వరకు తీసుకున్న పంట రుణాలను మాఫీ చేయనున్నట్లు ప్రకటించింది. 2023 డిసెంబర్ 9 నాటికి అసలు, వడ్డీ కలిపి రూ.2 లక్షల వరకు మాఫీ కానుంది. ఆహార భద్రత కార్డును ప్రామాణికంగా తీసుకుని, కుటుంబానికి రూ.2 లక్షలలోపు రుణాన్ని మాఫీ చేయనున్నారు. రూ. 2 లక్షలకన్నా ఎక్కువ రుణం ఉంటే ఎక్కువగా ఉన్న మొత్తాన్ని ముందుగా బ్యాంకుకు చెల్లించాల్సి ఉంటుంది. రీ షెడ్యూల్ చేసిన రుణాలు, దీర్ఘకాలిక రుణాలకు రుణమాఫీ వర్తించదని ప్రభుత్వం ప్రకటించింది. రుణమాఫీపై రైతుల సందేహాలను తీర్చేందుకు ఒక ప్రత్యేక విభాగం ఏర్పాటు చేస్తామని, వివరాల కోసం వెబ్ పోర్టల్‌నుగానీ, మండల సహాయ కేంద్రాలలోగానీ సంప్రదించవచ్చని వ్యవసాయ శాఖ పేర్కొంది. ఆగస్టు 15 వ తేదీలోపు రూ.2 లక్షల రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. పంట రుణాల మాఫీతో జిల్లాలో లక్ష పైచిలుకు మంది రైతులకు లబ్ధి చేకూరనుంది.

రేషన్ కార్డులు లేనివారికి నిరాశే..

ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులను జారీ చేయక ఏళ్లు గడుస్తున్నాయి. ఈ మధ్య కాలంలో చాలా కుటుంబాలు వేరుపడ్డాయి. వారు రేషన్ కార్డు కోసం ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి కుటుంబంగా ఉన్న రేషన్ కార్డుల ద్వారా రూ. 2 లక్షలు మాఫీ అవడం అంటే తమకు నష్టం జరుగుతుందని చాలామంది పేర్కొంటున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు రైతులందరికి సంబంధించిన రూ. 2 లక్షలలోపు పంట రుణాలను మాఫీ చేయాలని కోరుతున్నారు.

హర్షణీయం



రుణమాఫీకి సంబంధించి ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం. నాకు రూ.లక్ష వరకు పంట రుణాన్ని తీసుకున్నాను. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి సారు రైతుల రుణమాఫీ చేసిన తర్వాత మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయడం సంతోషకరం.

– కోదూరి రామయ్య, రైతు, మత్తమాల

రైతులకు ఎంతో మేలు



పంట రుణాల మాఫీతో ఎంతో మంది రైతులకు మేలు జరుగుతుంది. రుణమాఫీ కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. ఇప్పటికీ అవుతుందంటే రైతులకు మంచి చేసినట్లే. ఒకేసారి రుణాలను మాఫీ చేసి మళ్లీ వెంటనే ఇవ్వాలి.

– రాజమల్లయ్య, రైతు, ఉప్పర్‌పల్లి

పేకాట జోరు.. బతుకులు బేజారు

- జిల్లాలో విచ్చలవిడిగా సాగుతున్న జూదం
- అప్పుల పాలవుతున్న పలువురు
- దాడుల పేరుతో చిన్నాచితక కేసులతోనే సరిపెడుతున్న పోలీసులు
- బడాబాబుల వైపు కన్నెత్తి చూడడం లేదని విమర్శలు



సాక్షి, కామారెడ్డి: పేకాట సరదాగా మొదలై.. క్రమంగా వ్యసనంగా మారి ఎంతోమంది జీవితాలను రోడ్డున పడేస్తోంది. ఉన్నతంగా బతికిన వారిని అప్పుల పాలు చేస్తోంది. పత్తాలాట కోసం కొందరు ఆస్తులు తాకట్టు పెడితే, మరికొందరు అమ్మేస్తున్నారు. భార్య, పిల్లల మీద ఉన్న బంగారం ఆభరణాలను కూడా పేకాటలో తగలేస్తున్నారు. అన్నీ అయిపోయాక అప్పులు చేస్తున్నారు. అప్పులు తీర్చేమార్గం లేక ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలూ ఉన్నాయి. అనర్థాలకు కారణమవుతున్న పేకాటను అడ్డుకోవడానికి పోలీసులు చిత్తశుద్ధితో కృషి చేయడం లేదన్న విమర్శలున్నాయి. అప్పుడప్పుడు చిన్నచిన్న స్థావరాలపై దాడులు చేసి సాధారణ వ్యక్తులను అరెస్టు చేయడం తప్ప బడాబాబుల జోలికి వెళ్లకపోవడం విమర్శలకు తావిస్తోంది. పేకాట నిర్వాహకులు స్థానిక పోలీసులను మచ్చిక చేసుకోవడం ద్వారా నిరాటంకంగా తమ దందా సాగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. పేకాటకు అలవాటుపడిన వారు రూ.లక్షలు పోగొట్టుకుంటున్నారు.

అన్ని ప్రాంతాల్లో..

పేకాట జిల్లాలో దాదాపు అన్ని ప్రాంతాల్లో కొనసాగుతోంది. కొందరు అటవీ ప్రాంతాల్లో స్థావరాలు ఏర్పాటు చేసుకోగా.. బడా బాబులు ఇళ్లు, ఫామ్‌హౌస్‌లు కేంద్రంగా పేకాడుతున్నారు. మూడు ముక్కలాటలో రూ.లక్షలు పెడుతున్నారు. ఒక్కోసారి టేబుల్ మీద రూ.లక్షలు పోస్తున్నారు. కామారెడ్డి పట్టణంలో కొన్ని ఇళ్లు పేకాటకు అడ్డాగా మారాయన్న ఆరోపణలున్నాయి. కొందరు హోటళ్లు, లాడ్జీలలో రూంలు తీసుకుని పేడుతున్నారని తెలుస్తోంది. కామారెడ్డి చుట్టుపక్కల ఉన్న ఫామ్‌హౌస్‌లలో పేకాట స్థావరాలున్నాయని తెలుస్తోంది. పలుకుబడి ఉన్నవారి ఫామ్‌హౌజ్‌ల వైపు పోలీసులు కన్నెత్తి చూడరన్న ఉద్దేశంతో చాలా మంది పేకాటరాయుళ్లు వీటిని ఎంచుకుంటున్నారని సమాచారం.

క్యాసినో కోసం గోవాకు..

ఆర్థికంగా ఉన్నంతంగా ఉన్న వ్యక్తులు క్యాసినోల బాట పడుతున్నారు. జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది క్యాసినోల కోసం చాలామంది గోవా వెళ్తున్నట్లు తెలుస్తోంది. కామారెడ్డి నుంచి రెగ్యులర్‌గా వెళ్లి వచ్చే వారున్నారు. క్యాసినోలు నిర్వహించే క్లబ్‌లు ఆడేందుకు వెళ్లేవారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాయి. ఫ్లైట్ టికెట్లు కూడా వాళ్లే సమకూరుస్తున్నారు. దీంతో చాలామంది గోవా ట్రిప్ పేరుతో వెళ్లి క్యాసినో ఆడుతున్నారు. ఆటకు బానిసైన కొందరు నెలల తరబడి అక్కడే ఉంటున్నట్లు తెలుస్తోంది.

కుటుంబాలను పట్టించుకోకుండా..

పేకాట ఎవరికో ఒకరికి కలిసిరావచ్చు కానీ చాలా మందిని అప్పులపాలు చేస్తోంది. పేకాట జీవితాలను బలి తీసుకుంటుందన్న విషయం తెలిసినా ఆడుతూ నాశనం అవుతున్నారు. కొందరు కుటుంబాలను కూడా పట్టించుకోకుండా ఆటలో మునిగిపోతున్నారు. కామారెడ్డికి చెందిన ఓ వ్యాపారి పేకాటతో రూ.లక్షలు పోగొట్టుకుని చాలా ఆస్తులు అమ్మేశాడన్న ప్రచారం ఉంది. అయినా పేకాట మానడం లేదని సమాచారం. ఇలా చాలామంది ఆస్తులు పోగొట్టుకుని అప్పుల పాలవుతున్నారు. పోలీసులు దృష్టి సారించి పేకాట నిరోధానికి కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బాలకార్మికులు లేకుండా చూడాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: జిల్లాలో బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల కార్మికులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు.

14 ఏళ్లలోపు చిన్నారులు ఏ పని చేయకూడదన్నారు. వారితో ఎవరైనా పనులు చేయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 15 నుంచి 18 ఏళ్ల గల కౌమార కార్మికులను ప్రమాదకరమైన ప్రదేశాల్లో పని చేయించకూడదన్నారు. పాఠశాలకు గైర్హాజరయ్యే విద్యార్థులను విద్యాశాఖ అధికారులు గుర్తించి వివరాలను బాలల సంరక్షణ అధికారులకు తెలియపర్చాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఈవో రాజు, డీసీపీవో స్రవంతి, సహాయ కార్మిక కమిషనర్ కోటేశ్వర్లు, అధికారులు కమ్రుద్దీన్, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా చేపలవేట

- నిజాంసాగర్‌లో రింగులు, పాండ్రీలతో వల
- వ్యాపారులతో అధికారుల కుమ్మక్కు
- ఉపాధి కోల్పోతున్న మత్స్యకారులు



చేపలను తరలిస్తున్న వాహనాలు

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లో అక్రమంగా చేపల వేట సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా రింగ్‌లు, పాండ్రీలతో చేపలు పడుతున్నారు. చేపల మార్కెటింగ్ కేంద్రం మూతపడటంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో మత్స్యకారులు ఉపాధి కోల్పోతున్నారు. అచ్చంపేట మత్స్య సొసైటీ పరిధిలో కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని 44 గ్రామాల పరిధిలో 80 సంఘాలు ఉండగా 1,180 మత్స్యకార కుటుంబాలు ఆధారపడి బతుకుతున్నాయి. అయితే నిషేధిత పాండ్రీలు, రింగులతో వేటాడంతో ప్రాజెక్ట్‌లో చేపలు ఖాళీ అయి మత్స్యకారులకు ఉపాధి దొరకడం లేదు.


మార్కెటింగ్ సౌకర్యం లేకపోవడంతో..

నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లో ఏటా ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలను వదులుతోంది. ఈ చేపలను వేటాడూతు ఎంతో మంది మత్స్యకారులు బతుకుతున్నారు. అయితే అచ్చంపేట మత్స్య బీజ క్షేత్రంలో చేపల మార్కెటింగ్ మూతపడటంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవరిస్తున్నారు. ప్రాజెక్టు పరిధిలోని మత్స్య సొసైటీల కార్మికులు చేపలను వేటాడి వ్యాపారులకు విక్రయిస్తారు. మత్స్యకారుల అవసరాలను ఆసరాగా చేసుకున్న వ్యాపారులు నిబంధనలకు విరుద్ధంగా చేపల వేటకు తెరలేపారు. ప్రస్తుతం జలాశయంలో నీటి నిల్వలు తగ్గడంతో చేపల వేటకు అనుకూలంగా ఉంది. నిషేధిత పాండ్రీలు, రింగులతో రాత్రి వేళ చేపల వేట కొనసాగిస్తున్నారు.

ఇతర ప్రాంతాలకు తరలింపు

ప్రాజెక్ట్ పరిధిలోని ఎల్లారెడ్డి మండలం సాతెల్లి, మల్కాపూర్, జంగమాయపల్లి, నిజాంసాగర్ మండలం ఆరేడ్, ఆరేపల్లి, సంగారెడ్డి జిల్లాలోని మాసన్‌పల్లి, మాదపల్లి, రాంరెడ్డిపేట ప్రాంతాల్లో నిషేధిత రింగులు, పాండ్రీలతో చేపలు పడుతున్నారు. నిత్యం టన్నుల కొద్ది చేపలను హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు తరలిస్తున్నారు. అక్రమంగా వేటా సాగిస్తున్న వ్యాపారులతో మత్స్యశాఖ అధికారులు కుమ్మక్కైనట్లు ఆరోపణలు ఉన్నాయి. అధికారులు స్పందించి అక్రమ వేటను నిషేధించాలని మత్స్యకారులు కోరుతున్నారు.

అక్రమ వేటను అరికట్టాలి



నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లో అక్రమంగా చేపల వేట కొనసాగిస్తూ మత్స్యకారుల పొట్ట గొడుతున్నారు. రింగులు, పాండ్రీలు వేయిస్తూ టన్నుల కొద్ది చేపలను వేటాడుతున్నారు. దీంతో వ్యాపారులు రూ.లక్షలు ఆర్జిస్తున్నారు. మత్స్య కార్మికులు మాత్రం ఉపాధి కోల్పోయే ప్రమాదం ఉంది.

– కృష్ణ, హసన్‌పల్లి, సొసైటీ మాజీ డైరెక్టర్

చేపల వేట నిషేధం

నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లో రింగులు, పాండ్రీలతో చేపల వేట నిషేధం. రెండు రోజుల క్రితం రాత్రివేళ ఆరేపల్లి, ఆరేడ్ ప్రాంతాల్లో నిషేధిత వలతో చేపల వేట చేయగా పట్టుకున్నాం. వచ్చే రెండు నెలలు ప్రాజెక్టులో ఎవరూ కూడా చేపలు పట్టొద్దు.

– డోలిసింగ్, ఎఫ్‌డీవో, అచ్చంపేట

ఆలయ అర్చకులకూ బదిలీ!

- ఉమ్మడి జిల్లాలో 45 మంది ట్రాన్స్‌ఫర్ అయ్యే అవకాశం
- వ్యతిరేకిస్తున్న అర్చక సంఘాలు

సాక్షి, కామారెడ్డి: ఒకేచోట నాలుగేళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీ చేయడానికి ప్రభుత్వం తీసుకున్న చర్యల్లో భాగంగా దేవాదాయ శాఖ పరిధిలో పనిచేసే ఉద్యోగుల బదిలీలు కూడా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ప్రభుత్వం నుంచి వేతనం పొందుతున్న ఆలయ అర్చకులనూ బదిలీ చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే వారినుంచి బదిలీల కోసం ఆప్షన్లు తీసుకోవడంతో అర్చకుల బదిలీలు జరుగుతాయా అన్నదానిపై చర్చ నడుస్తోంది. ఉమ్మడి జిల్లాలోగల 17 ప్రధాన ఆలయాల పరిధిలో 45 మంది అర్చకులు పనిచేస్తున్నారు. వీరందరూ బదిలీ అయ్యే అవకాశాలున్నాయి. అయితే బదిలీల నిర్ణయాన్ని అర్చకులు వ్యతిరేకిస్తున్నారు. ఆలయాల్లో ఈవోలు, సిబ్బంది బదిలీలు సర్వసాధారణమని, అర్చకులను ఎప్పుడూ బదిలీ చేయలేదని వారు అంటున్నారు. ఎండోమెంట్ యాక్ట్ ప్రకారం ఆలయాల్లో పనిచేసే అర్చకులు ఆయా ఆలయాల సంప్రదాయాల ప్రకారం పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తారని, వారిని బదిలీ చేయడం ద్వారా అనాదిగా వస్తున్న సంప్రదాయాలకు విఘాతం కలుగుతుందని పేర్కొంటున్నారు. అయితే ప్రభుత్వం నుంచి వేతనం పొందుతున్నందున అర్చకులకూ బదిలీలు ఉండాలని సర్కారు యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అర్చకుల్లో ఆందోళన నెలకొంది. ప్రభుత్వ ఉద్యోగులతో పాటే అర్చకుల బదిలీలు జరుగుతాయా? లేకపోతే ఆప్షన్లతోనే ప్రక్రియ ఆగిపోతుందా అన్నదానిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని వేచి చూస్తున్నారు.

వామ్మో గుంత..



''యాక్సిడెంట్ అంటే బైకో.. కారో రోడ్డు మీద పడటం కాదు.. ఒక కుటుంబం మొత్తం రోడ్డు మీద పడిపోవటం..'' అనే సినిమా డైలాగ్ ఎంత మందిని ప్రభావితం చేసిందో తెలియదు కానీ.. ఆర్ అండ్ బీ అధికారులను మాత్రం ప్రభావితం చేయలేకపోతోంది. మద్నూర్ మండలంలోని దోతి గ్రామం నుంచి మద్నూర్, బిచ్కుంద వైపు వెళ్లే రోడ్డు మధ్యలో భారీ గుంత ఏర్పడి నెలలు కావొస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఇప్పటికే ఆ గుంతలో పడి పలువురు కాళ్లు, చేతులు విరిగి ఆస్పత్రుల పాలయ్యారు. గుంతలో పడి ఎవరి ప్రాణాలు పోకముందే మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

– మద్నూర్(జుక్కల్)

చలో అరుణాచలం..

- పౌర్ణమికి ఇందూరు నుంచి ఆర్టీసీ బస్సులు
- 21న గిరిప్రదక్షిణకు ప్రత్యేక సేవలు
- ప్యాకేజీలో కాణిపాకం, శ్రీపురం, జోగులాంబ శక్తిపీఠం సైతం సందర్శన



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అరుణాచలం, అరుణగిరి, తిరువణ్ణామలై అనే పేర్లతో పిలుచుకునే తమిళనాడులోని శైవ క్షేత్రం సందర్శనకు ఆసక్తి చూపేవారిలో తెలుగువాళ్లే అధికం. అరుణగిరి ప్రదక్షిణ చేసి అగ్ని లింగాన్ని దర్శించుకునేందుకు వెళ్లే భక్తుల కోసం టీజీఎస్ ఆర్టీసీ ప్రత్యేక సేవలు అందించనుంది. ఇందూరు నుంచి పౌర్ణమికి గిరిప్రదక్షిణకు వెళ్లాలనుకునే భక్తుల కోరిక మేరకు సూపర్ లగ్జరీ బస్సులను ఆర్టీసీ ఏర్పాటు చేసేందుకు నిర్ణయించింది. ఈనెల 21న పౌర్ణమిని పురస్కరించుకుని గిరిప్రదక్షిణ కోసం ఏర్పాటు చేయనున్న బస్సు ద్వారా వెళ్లేందుకుగాను భక్తులు ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకునే సదుపాయాన్ని కల్పించారు. నిజామాబాద్ నుంచి ఈ నెల 19వ తేదీ రాత్రి 8 గంటలకు బస్సు బయలుదేరనుంది. 20వ తేదీ ఉదయం 10 గంటలకు కాణిపాకం చేరుకుంటుంది. అక్కడ వినాయకుడి దర్శనం అనంతరం, సాయంత్రం 5 గంటలకు వేలూరు గోల్డెన్ టెంపుల్ దర్శనం ఉంటుంది. అనంతరం రాత్రి వరకు అరుణాచలం చేరుకుంటుంది. 21న భక్తులు గిరి ప్రదక్షిణ అనంతరం బస్సు తిరుగుప్రయాణం సాయంత్రం 5 గంటలకు మొదలవుతుంది. 22వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు జోగులాంబ శక్తిపీఠం ఆలయానికి చేరుకుంటుంది. దర్శనం తనంతరం ఉదయం 9 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి అదేరోజు సాయంత్రం 6 గంటలకు నిజామాబాద్‌కు చేరుకుంటుంది. టిక్కెట్టు ధర పెద్దవారికి రూ. 4,200, పిల్లలకు రూ. 3,400గా నిర్ణయించారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. www.tsrtconline.in ద్వారా కానీ సమీప బస్‌స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్‌లో గానీ బుక్‌చేసుకునే సదుపాయం కల్పించారు.

గతేడాది ఐదు బస్సులు..



భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా అరుణాచలానికి బస్సులు కేటాయిస్తున్నాం. భక్తులు ఒక్కొక్కరిగానైనా, బృందాలుగానైనా సరే బుకింగ్ చేసుకోవచ్చు. పౌర్ణమికి ప్రదక్షిణ సమయంలోనైనా సరే, సాధారణ సమయాల్లోనైనా సరే అరుణాచలానికి బస్సులు బుక్ చేసుకోవచ్చు. కొన్ని కుటుంబాలు కలిసి బుక్ చేసుకున్నప్పటికీ బస్సులను కేటాయిస్తాం. గతేడాది అరుణాచలానికి 5 బస్సులను నడిపాం. సుశిక్షితులైన అనుభవం కలిగిన డ్రైవర్లతో సురక్షితమైన ప్రయాణం చేసే అవకాశం ఒక్క ఆర్టీసీ ద్వారా మాత్రమే ఉంది. కేటాయించే బస్సుల్లో పుష్‌బ్యాక్ సీట్లు, టీవీ, మొబైల్ చార్జింగ్ సౌకర్యం ఉంటుంది. ఉమ్మడి నిజామాబాద్ వారు సద్వినియోగం చేసుకోవాలి.

– కె జానీరెడ్డి, ఆర్టీసీ రీజినల్ మేనేజర్, నిజామాబాద్

సీఎం సహకారంతో బాన్సువాడ అభివృద్ధి



ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

- ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి
- ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌కు సన్మానం

బాన్సువాడ రూరల్: సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో బాన్సువాడ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియామకమైన కాసుల బాల్‌రాజ్ తొలిసారి బాన్సువాడకు వచ్చిన సందర్భంగా సోమవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. పోచారం మాట్లాడుతూ.. తాను రాజకీయ జీవితం ప్రారంభించింది కాంగ్రెస్ పార్టీలోనే అని గుర్తుచేశారు. కొత్త, పాత తేడా లేకుండా అందరిని కలుపుకుని ముందుకు వెళ్తానన్నారు. కాసుల బాల్‌రాజ్ మాట్లాడుతూ.. పోచారం శ్రీనివాస్‌రెడ్డితో తాను 15 ఏళ్ల పోరాటం చేశానని గుర్తుచేశారు. నియోజకవర్గ అభివృద్ధిని ఆకాంక్షిస్తూ పోచారం కాంగ్రెస్‌లో చేరటం శుభ పరిణామమన్నారు. తామిద్దరం ఇక్కడ లోకల్ అని, ఇతర నియోజకవర్గాల నుంచి వచ్చిన వారి దుకాణం బంద్ అవుతుందని విమర్శలు చేశారు. అంతకుముందు కొయ్యగుట్ట చౌరస్తాలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద పోచారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కాసుల బాల్‌రాజ్ నివాళి అర్పించారు. అక్కడి నుంచి డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ కాసుల రోహిత్ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. కాసులను మాజీ స్పీకర్ పోచారం సన్మానించి మెమోంటో అందజేశారు. వివిధ మండలాల నుంచి వచ్చిన నాయకులు, ప్రజాప్రతినిధులు కాసుల బాల్‌రాజ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నార్ల రత్నకుమార్, కత్తెర గంగాధర్, నార్ల సురేశ్, అబ్దుల్ ఖాలెఖ్, అలీబిన్ అబ్దుల్లా, మధుసూదన్‌రెడ్డి, మాజిద్, పల్లికొండ సాయిబాబ, మోహన్‌నాయక్, పిట్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోండి

కామారెడ్డి క్రైం : విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే క్రైస్తవ మైనార్టీల విద్యార్థులు సీఎం ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మైనారిటీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి దయానంద్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. విదేశీ విశ్వవిద్యాలయాల్లో 2024 యేడాదికి గాను పీజీ, డాక్టరేట్, పీహెచ్‌డీ చేయాలనుకునే వారు స్కాలర్‌షిప్ మంజూరుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. పీజీ, డాక్టరేట్‌లో 2024 జనవరి 1 నుంచి జూలై 31 మధ్య విదేశీ విశ్వవిద్యాలయాల్లో సీట్లు పొందిన వారు ఆగస్టు 8 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. మిగితా వివరాలకు 80969 73346లో గాని, నేరుగా తమ కార్యాలయంలో గానీ సంప్రదించాలన్నారు.

యూఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సంజయ్

మద్నూర్(జుక్కల్) : భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్‌ఎఫ్‌ఐ) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డోంగ్లీ మండలంలోని లింబుర్‌కు చెందిన తల్లారి సంజయ్ బాధ్యతలు చేపట్టారు. సోమవారం ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై పోరాడుతానన్నారు.

పీఆర్టీయూ సభ్యత్వ వారోత్సవాలను సక్సెస్ చేయాలి



దోమకొండ : ఈనెల 18వ తేదీన ప్రారంభమయ్యే పీఆర్టీయూ సభ్యత్వ నమోదు వారోత్సవాలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఆయన సంఘం ప్రతినిధులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సమస్యల సాధనలో పీఆర్టీయూ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కమిటీ ప్రతినిధులు మర్రి శేఖర్, జస్వంత్‌రావ్, మహేందర్, మండల ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు లక్ష్మణ్‌రావ్, వెంకట్‌రెడ్డి, బాలకిషన్ తదితరులున్నారు.

28న హైదరాబాద్‌లో ఆధ్యాత్మిక కార్యక్రమం

కామారెడ్డి అర్బన్ : ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వైద్యుల కోసం ఈనెల 28న ఆదివారం ఉదయం 11గంటలకు హైదరాబాద్ గౌచ్చిబౌలిలోని పీస్ ఆడిటోరియంలో హీల్ హెల్పర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయం నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి ఇన్‌చార్జి బీకే జయదీదీ తెలిపారు. వైద్యుల కోసం రెండు గంటల పాటు నిర్వహించే హీల్ హెల్పర్ ఆధ్మాత్మిక కార్యక్రమానికి అన్ని రకాల వైద్యులతో పాటు ఆర్‌ఎంపీ, పీఎంపీలు హాజరు కావచ్చన్నారు. వివరాలకు 99129 16539లో సంప్రదించవచ్చన్నారు.

షరతుల్లేకుండా రుణమాఫీ చేయాలి



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో సొసైటీ పాలకవర్గ సమావేశాన్ని చైర్మన్ ఏగుల నర్సింలు అధ్యక్షతన నిర్వహించారు. సోమవారం సొసైటీలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో రైతులందరికి ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని తీర్మానం చేశారు. దీర్ఘకాలిక రుణాలను అందించేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, డైరెక్టర్లు గోపికృష్ణ, నారాయణ, ప్రకాష్, సుఖేందర్‌రెడ్డి, కార్యదర్శి విశ్వనాథం ఉన్నారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి 127 ఫిర్యాదులు



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



బారులు తీరిన ఫిర్యాదుదారులు

కామారెడ్డి క్రైం : ప్రజావాణికి వస్తున్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 127 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో 74 ఫిర్యాదులు రెవెన్యూ శాఖకు సంబంధించిన భూ సమస్యలవే కావడం గమనార్హం. మరో 10 మున్సిపల్, 8 డీఆర్‌డీవో, 6 పంచాయతీ అధికారి, 6 ఉపాధి కల్పన అధికారి కార్యాలయానికి రాగా మిగితావి ఆయా శాఖలకు చెందిన ఫిర్యాదులు నమోదయ్యాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుల పరిష్కారాల విషయంలో నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ఎంతో మంది తమ సమస్యలకు పరిష్కారం కోరుతూ ప్రజావాణికి వస్తుంటారని అన్నారు. వీలైనంత త్వరగా పరిష్కరించడం గాపి, పరిష్కార మార్గాలు చూపడం గాని చేపట్టాలన్నారు. అంతేకాకుండా రాష్ట్ర స్థాయిలో ప్రజావాణి నుంచి జిల్లాకు వస్తున్న వినతులు, ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డీఆర్‌డీవో చందర్ నాయక్, ఏఓ మస్రూర్ అహ్మద్, ఆయా శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటినంబర్‌కు ధ్రువీకరణ ఇవ్వట్లేదు..



నూతన గ్రామ పంచాయితీగా ఏర్పడిన తర్వాత కొత్తగా కేటాయించిన ఇంటి నెంబర్‌కు సంబంధించిన ధ్రువీకరణను జీపీ అధికారులు ఇవ్వడం లేదని గాంధారి మండలం వండ్రికల్ గ్రామానికి చెందిన ఇన్నయ్య వాపోయాడు. ఆయన మాట్లాడుతూ వండ్రికల్ గ్రామం గతంలో గుర్జాల్ జీపీ పరిధిలో ఉండేదని ఐదేళ్ల క్రితం జరిగిన జీపీల పునర్విభజనలో ప్రత్యేక జీపీగా ఏర్పడిందన్నారు. నూతన జీపీగా ఏర్పడిన తర్వాత ఇంటి నెంబర్లు మారిపోయాయని, కొత్త ఇంటి నెంబర్‌ల ఆధారంగానే పన్నుల వసూళ్ళు సహా అన్ని పనులు జరుగుతున్నాయ. తాను మూడేళ్లుగా తిరుగుతున్నా తనకు కొత్త ఇంటి నెంబర్ ఇవ్వట్లేదన్నారు. – ఇన్నయ్య, వండ్రికల్, గాంధారి మండలం

రికవరీకి వెళ్తే బెదిరిస్తున్నారు..

మహిళా సంఘాలకు చెందిన డబ్బులను సొంతానికి వాడుకోవడమే కాకుండా రికవరీకి వెళ్తే బెదిరించడం, దాడులకు పాల్పడుతున్న వారి నుంచి రక్షణ కల్పించాలని పట్టణానికి చెందిన మెప్మా రీసోర్స్ పర్సన్ లావణ్య ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఆమె మాట్లాడుతూ.. పట్టణానికి చెందిన మయూరి మహిళా సంఘానికి గతంలో రుణం మంజూరు చేయగా అందరు సభ్యులు సకాలంలో డబ్బులను వాయిదాల పద్దతిలో మొదటి లీడర్‌గా ఉన్న రాజేశ్వరికి అప్పగించారన్నారు. ఆ డబ్బులను బ్యాంక్‌లో వేయకుండా స్వంతానికి వాడుకోవడమే కాకుండా రికవరీకి వెళ్ళిన తనను భర్త శ్రీనివాస్‌తో కలిసి బెదిరించి దాడి చేశారన్నారు. ఈ విషయమై ఐసీడీఎస్ పీడీకి ఫిర్యాదు చేశామన్నారు. అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. – లావణ్య, మెప్మా రీసోర్స్ పర్సన్

ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా అంగన్‌వాడీలు



మద్నూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

మద్నూర్(జుక్కల్) : ప్రైవేటు స్కూళ్లకు దీటుగా అంగన్‌వాడీలను ఏర్పాటు చేస్తామని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి సునంద పేర్కొన్నారు. మండల కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం అమ్మమాట అంగన్‌వాడీ బాట ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రభుత్వం అంగన్‌వాడీలను బలోపేతం చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు కవిత, వినోద, అంగన్‌వాడీ టీచర్లు కోమరవ్వ, కళావతి తదితరులున్నారు.

లింగాపూర్‌లో అమ్మమాట–అంగన్‌వాడీల బాట

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి పట్టణం లింగాపూర్‌లో సోమవారం అమ్మమాట–అంగన్‌వాడి బాట కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడి కేంద్రాల్లో ఐదేళ్ల లోపు పిల్లలను చేర్పించాలని, వాటి ప్రాముఖ్యతను తెలియజేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిడిఓ శ్రీలత, దేవునిపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ పద్మ, అంగన్‌వాడి టీచర్లు ఉమారాణి, పద్మ, లలిత, మహిళా సంఘాల అధ్యక్షురాలు సంతోషి తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్‌లో..

నిజాంసాగర్(జుక్కల్) : మహమ్మద్ నగర్ మండలంలోని తుర్కపల్లి, ఒడ్డెర కాలనీలో సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అమ్మ మాట, అంగన్‌వాడి బాట ర్యాలీ నిర్వహించారు. మహమ్మద్ నగర్ మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి ఆధ్వర్యంలో టీచర్లు, పిల్లలు, తల్లులతో కలిసి గల్లీల్లో తిరుగుతూ ర్యాలీ తీశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు తీర్మానం



భిక్కనూరు : మండల కేంద్రంలోని జీపీ కార్యాలయం ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు సోమవారం గ్రామస్తులు, అఖిల పక్ష నేతలు ఏకగ్రీవంగా తీర్మానించారు. గతంలో సర్పంచ్‌గా తున్కి వేణు హయాంలో జీపీ కార్యాలయం ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని తీర్మానించి గద్దెను కూడా నిర్మించినప్పటికీ ఎన్నికల కోడ్‌లు రావడంతో ఏర్పాటు వాయిదా పడింది. ఈ సందర్భంగా విగ్రహ ఏర్పాటు కోసం తీర్మానించి జీపీ ఈవో మహేష్ గౌడ్‌కు అందజేశారు.

రైతు కల్లం నిర్మాణం కోసం భూమి పూజ



మాచారెడ్డి : పాల్వంచ మండలం ఆరేపల్లి శివారులో సోమవారం బీజేపీ నాయకులు రైతు కల్లాల నిర్మాణం కోసం భూమి పూజ నిర్వహించారు. గత నెలలో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి ప్రతి గ్రామంలో రైతు కల్లాల ఏర్పాటు కోసం సమావేశాలు ఏర్పాటు చేశారు. అసెంబ్లీ కన్వీనర్ కుంటా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డి అభివృద్ధి కోసం తాను సొంతంగా రూ. 150 కోట్లతో అభివృద్ధి చేస్తానని ఇచ్చిన హామీ ప్రకారం రైతు కల్లాలను నిర్మిస్తామన్నారు. అన్ని గ్రామాల్లో రైతు కల్లాలను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు తేలు శ్రీనివాస్, విపుల్, శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్ తదితరులున్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా చూడాలి



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సదాశివనగర్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఆస్మాఅఫ్షిన్ సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఎక్కడైనా నీరు నిలువ ఉండకుండా చూడాలని, తాగునీటి నమూనా పరీక్షలు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎంపీవో సురేందర్ రెడ్డి, సీహెచ్‌వో నాగరాజు తదితరులున్నారు.

1.32సెం.మీ. వర్షపాతం నమోదు

మద్నూర్: మండలంలో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. 1.32 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదయ్యిందని తహసీల్దార్ ముజీబ్ తెలిపారు. భారీ వర్షం కురియడంతో ప్రస్తుతం ఉన్న పంటలకు జీవం పోసినట్లు అయ్యిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వర్షకాలం ప్రారంభం నుంచి ఇంత పెద్ద వాన కురవలేదని పేర్కొంటున్నారు.

ఉన్నతంగా జీవించడం నేర్చుకోవాలి



మాచారెడ్డి : విద్యార్థులు ఉన్నతంగా జీవించడం నేర్చుకోవాలని కామారెడ్డి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చిలువేరు మారుతి సూచించారు. మండలంలోని చుక్కాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదిత్య ఆస్పత్రి వైద్యుడు అజయ్ పేరాల, లయన్ దేవి చంద్ ల సహకారంతో టై బెల్టులు పంపిణీ చేశారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కామారెడ్డి క్రైం : ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంక్షేమ హాస్టళ్ల సందర్శన కార్యక్రమం సోమవారం రెండవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా కామారెడ్డిలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కన్వీనర్ శివప్రసాద్, ప్రతినిధి సంపత్ లు మాట్లాడుతూ ఎస్సీ, బీసీ హాస్టల్లో ఇంటర్ నుంచి డిగ్రీ కోర్సుల వరకు చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వాలన్నారు.

'లయన్స్' ఆధ్వర్యంలో కంటివైద్య శిబిరం

మద్నూర్(జుక్కల్) : డోంగ్లీ మండలంలోని దోతిలో సోమవారం గ్రామ యువకుల ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులు, కంటి అద్దాలు అందిస్తున్నామన్నారు. మద్నూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ సంగమేశ్వర్, మాజీ సర్పంచ్ కాశీనాథ్‌పటేల్, సంగ్రాంపటేల్, లయన్స్ క్లబ్ కంటి ఆస్పత్రి క్యాంప్ ఇన్‌చార్జి హనుమంతరావు తదితరులున్నారు.

డీఎస్సీ పరీక్షా కేంద్రం వద్ద బందోబస్తు

ఖలీల్‌వాడి: డీఎస్సీ పరీక్షలు ఈ నెల 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో నగరంలోని నాలెడ్జ్ పార్క్ స్కూల్ డీఎస్సీ పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు సీపీ కల్మేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే సెంటర్ వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. పరీక్షలు 13 రోజుల పాటు కొనసాగనున్నాయని తెలిపారు. పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యా హ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్ష కేంద్రంలో జిరాక్స్ సెంటర్లు గాని ఇతర షాపులు తెరిచి ఉంచకూడదని ఆదేశించారు.

కృష్ణాజీవాడిలో గ్రామస్తుల ధర్నా



కామారెడ్డి – ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో ధర్నా చేస్తున్న గ్రామస్తులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : పంచాయతీకి చెందిన వాటర్‌ట్యాంక్ చోరీకి గురవ్వగా ఇప్పటివరకు ఆచూకీ కనిపెట్టకపోవడంతో ఆగ్రహానికి గురైన కృష్ణాజీవాడి గ్రామస్తులు సోమవారం కామారెడ్డి ఎల్లారెడ్డి రహదారిపై ధర్నా చేశారు. వివరాల్లోకి వెళ్తే.. 10రోజుల క్రితం జీపీకి చెందిన నర్సరీ వద్ద ఉన్న వాటర్‌ట్యాంకర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారని, ఈ విషయమై జీపీ కార్యదర్శి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని గ్రామస్తులు పేర్కొన్నారు. అయినా ఇప్పటివరకు ట్యాంకర్ ఆచూకీ దొరకలేదని, అలాగే ఐదేళ్లుగా జీపీకి చెందిన స్టార్టర్లు, బోరుమోటార్లు, కేబుల్‌వైర్లు, పంపుసెట్లు తదితర వస్తువులు చోరీకి గురైనప్పటికీ పోలీసుల నుంచి స్పందన లేదన్నారు. సుమారు రూ. 10 లక్షల విలువ సామాగ్రి చోరీకి గురయ్యాయని, జీపీ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే ఇలా జరుగుతోందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. రహదారిపై ధర్నా చేయడంతో ఎస్సై వెంకటేశ్వర్లు హుటాహుటిని చేరుకుని గ్రామస్తులను సముదాయించారు. చోరీ కేసును ఛేదిస్తామన్నారు. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, యువకులు గస్తీ తిరగాలని, తాము కూడా పెట్రోలింగ్ చేస్తామని ఎస్సై పేర్కొన్నారు.

'పెన్షనర్లకు ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలి'



నిరసన తెలుపుతున్న పెన్షనర్ల జేఏసీ నాయకులు

కామారెడ్డి అర్బన్ : పెన్షనర్లకు ప్రత్యేక డైరెక్టరేట్ ఏర్పాటు చేయాలని, నాలుగు విడతలుగా రావాల్సిన కరవుభత్యం వాయిదాలను వెంటనే చెల్లించాలని, ఆరోగ్య భద్రత ఈహెచ్‌ఎస్ కార్డులు అన్ని కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రుల్లో క్యాష్‌లెస్ అమలు అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని పెన్షనర్ల జేఏసీ డిమాండ్ చేసింది. పెన్షనర్ల జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు సోమవారం కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల జేఏసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు వినతి ప్రతం అందజేసింది. మధ్యంతర భృతి 5 శాతాన్ని 20 శాతానికి పెంచాలని, స్పెషల్ టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని తదితర డిమాండ్లను వినతిపత్రంలో పొందుపర్చారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ ఉమ్మడి రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు కావేటి వేణుగోపాల్, టీపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు కే.రమణ, డీటీఎఫ్ జిల్లా పూర్వ అధ్యక్షుడు పి విజయరామరాజు, ప్రతినిధులు హన్మంత్‌రెడ్డి, కే.శ్రీనివాస్, పి.అంజయ్య, నాగరాజశర్మ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పలువురి అండ

- అవయవదానం చేసిన కుటుంబానికి ఆర్థికసాయం



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న దృశ్యం

భిక్కనూరు : అవయవదానం చేసిన నిరుపేద మెట్టు ప్రవీణ్ కుటుంబానికి పలువురు సోమవారం ఆర్థికసాయం, నిత్యావసరాలు అందజేశారు. పెద్ద మల్లారెడ్డి గ్రామానికి చెందిన శ్రీ షిర్డి సాయి సేవా సమితి ప్రతినిధులు రూ. 5వేలు, కాచాపూర్ గ్రామానికి చెందిన ఊడెం శ్రీనివాస్‌రెడ్డి రూ. 1000, ట్రాక్టర్ యూనియన్ రూ. 5వేలు, రామాయంపేట ఆటో యునియన్ రూ. 2,500 వేలు, జాతీయ మానవ హక్కుల కమిటీ ఆధ్వర్యంలో రెండు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులను అందజేశారు. అలాగే చాలా మంది 'సాక్షి'లో ప్రచురితమైన 'అవయవదానం చేసిన కుటుంబాన్ని ఆదుకోవాలి' కథనాన్ని సోషల్‌మీడియాలో తమ స్టేటస్‌గా పెట్టుకోవడంతో చాలామంది వారి స్నేహితులు ఫోన్‌పే ద్వారా బాధిత కుటుంబానికి డబ్బులు పంపుతున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సురేశ్ రెడ్డి 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



జుక్కల్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ వద్ద అంగన్‌వాడీలు



బాన్సువాడలో ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తూ..

నిజాంసాగర్(జుక్కల్): అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం జుక్కల్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు క్యాంప్ కార్యాలయాన్ని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు ముట్టడించారు. క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అందుబాటులో లేకపోవడంతో కార్యాలయం ముందు టీచర్లు, ఆయాలు బైఠాయించారు. అంగన్‌వాడీలు మాట్లాడుతూ అద్దె భవనాల్లో నడుస్తున్న అంగన్‌వాడీలకు ప్రభుత్వం నుంచి నెలనెలా అద్దె చెల్లించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు గౌరవవేతనం రూ 26 వేల ఇవ్వాలన్నారు. పదవీ విరమణ సమయంలో రూ. 2 లక్షలు ఇవ్వాలని ఆయాలకు రూ. 1 లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆయా మండలాల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

బాన్సువాడ : అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్‌ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎమ్మెల్యే ఇంటికి అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు ర్యాలీగా వెళ్లి వినతిపత్రం అందించారు.సీఐటీయూ నాయకులు ఖలీల్, అంగన్‌వాడీ టీచర్లు మహాదేవి, సరిత తదితరులున్నారు.

కాసులకు ఘనస్వాగతం



కాసుల బాల్‌రాజ్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

నిజాంసాగర్(జుక్కల్) : రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి మొదటిసారిగా నిజాంసాగర్ మండలానికి వచ్చిన కాసుల బాల్‌రాజ్‌కు నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ మండలాల కాంగ్రెస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. జుక్కల్ నియోజకవర్గం నుంచి వచ్చి ద్విచక్రవాహనాలు, కార్లతో ఆగ్రో చైర్మన్‌కు భారీగా స్వాగత ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు జయప్రదీప్, మల్లికార్జున్, రవీందర్‌రెడ్డి, రమేశ్ యాదవ్, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

ఇరువైపులా చెట్లకొమ్మలు తొలగించాలి



కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న యువకులు

బీబీపేట : బీబీపేట గ్రామానికి ఆమ్లెట్ గ్రామం రాంరెడ్డిపల్లె నుండి యాడారం రోడ్డు వరకు రోడ్డుకు ఇరువైపుల ఉన్నటువంటి చెట్లకొమ్మలు తొలగించాలని కోరుతూ సోమవారం గ్రామ యువకులు సురేశ్, రాజలింగం జీపీ కార్యదర్శి రమేశ్‌కు వినతి పత్రం అందజేశారు. రోడ్డుకు ఇరువైపులా చెట్లు, ముళ్ల పొదలు ఉండడంతో గ్రామానికి ఆర్టీసీ బస్సు రావటానికి ఇబ్బంది కలుగుతుందని వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఆర్టీసీ బస్సుకు ఇబ్బందులు తలెత్తడంతో బస్సు గ్రామానికి రావడం లేదని దీంతో గ్రామస్తులకు ఇబ్బందులు అవుతున్నాయని తెలిపారు.

క్రైం కార్నర్

మద్యానికి బానిసై ఆత్మహత్య

బోధన్‌రూరల్: మద్యానికి బానిసై సాలూర మండలం జాడిజమాల్‌పూర్ గ్రామానికి చెందిన వి వెంకటేశ్ (33) చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు. వెంకటేశ్‌కు తొమ్మిదేళ్ల క్రితం పెళ్లయి విడాకులయ్యాయయి. అప్పటి నుంచి తల్లిదండ్రులతో ఉంటున్న వెంకటేశ్ మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది ఈనెల 13న గ్రామశివారులోని చెరువులో దూకాడు. సోమవారం నీటిలో వెంకటేశ్ మృతదేహం తేలింది. మృతుడి తండ్రి నర్సింలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

బయటి నుంచి గడియపెట్టి మేకల చోరీ

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఇళ్లకు బయటి నుంచి గడియ పెట్టిన దుండగులు కొట్టంలోని మేకలను ఎత్తుకెళ్లిన ఘటన మండల కేంద్రంలోని గోపాల్‌పేటలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. గోపాల్‌పేటలోని ఎస్సీ కాలనీలో దోసపల్లి అనుశవ్వ రోజూలాగే ఆదివారం తన ఇంటి ముందున్న కొట్టంలో సుమారు 30 మేకలను కట్టేసి ఉంటుంది. అర్ధరాత్రి వేళ వచ్చిన దుండగులు అనుశవ్వ ఇంటితోపాటు పక్కనే ఉన్న మరో రెండు ఇళ్లకు బయటి నుంచి గడియపెట్టి 14 మేకలను ఎత్తుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నవీపేట: మండలంలోని అబ్బాపూర్(ఎం)లో బాసర రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెంజల్ మండలం వీరన్నగుట్టకు చెందిన ప్రవీణ్‌కు తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. వీరన్నగుట్ట నుంచి నిజామాబాద్ వైపు వెళ్తుండగా బైక్ అదుపుతప్పి ప్రవీణ్ కిందపడిపోవడంతో కాళ్లకు తీవ్రగాయాలయ్యాయన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న వాహనం



మాచారెడ్డి: విద్యుత్ స్తంభాన్ని వాహనం ఢీకొన్న ఘటనలో స్తంభం ధ్వంసం కాగా వాహనంలో ప్రయాణిస్తున్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వాహనం ఢీ కొనడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోగా పెనుప్రమాదం తప్పింది. మండలంలోని తడ్కపల్లికి చెందిన పంతులు నాయక్ కుటుంబ సభ్యులతో కలిసి టాటా ఈకో వాహనంలో హైదరాబాద్ నుంచి సోమవారం ఉదయం తడ్కపల్లికి వస్తుండగా గజ్యా నాయక్ తండా చౌరస్తాలో రోడ్డు పక్కన స్తంభాన్ని వాహనం ఢీకొన్నది.

కలెక్టర్‌కు ఫిర్యాదు

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లిలో బెల్ట్‌షాపును నిర్వహిస్తుండడంతో, గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందని కలెక్టర్‌కు ప్రవీన్ రెడ్డి అనే యువకుడు సోమవారం ఫిర్యాదు చేశఋాడు. వీడీసీ ఆధ్వర్యంలో మద్యం షాపు నిర్వహణకు, మొరం తవ్వకాలకు టెండర్లు నిర్వహించారని, బాధ్యులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

నకిలీ బంగారం అంటగట్టిన వ్యాపారి



దుకాణం వద్ద విచారణ జరుపుతున్న పట్టణ పోలీసులు

కామారెడ్డి క్రైం: కస్టమర్‌కు ఓ వ్యాపారి నకిలీ బంగారం అంటగట్టాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. భిక్కనూరు మండలం కంచర్ల గ్రామానికి చెందిన మట్టి శ్రీకాంత్‌రెడ్డి అనే వ్యక్తి ఈ నెల 14న కామారెడ్డి లోని ఓ జ్యూయెలరీ షాపులో 3 గ్రాముల బంగారు ఉంగరం కొనుక్కున్నాడు. అయితే, ఉంగరం నాణ్యతపై అనుమానంతో హైరాబాద్‌లోని గోల్డ్ టెస్టింగ్ సెంటర్‌లో పరీక్షలు చేయించాడు. ఉంగరం నకిలీది అని తేలడంతో సోమవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పట్టణ పోలీసులు దుకాణం వద్దకు చేరుకుని విచారణ చేపట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.